క్లుప్తంగా

కోళ్ల ఫారం పరిశీలన



చిన్నర్సుపల్లెలో కోళ్ల ఫారాన్ని పరిశీలిస్తున్న అధికారి డా.మాలకొండయ్య

చిన్నమండెం : మండల పరిధిలోని చిన్నర్సుపల్లె గ్రామంలో ఉన్న కోళ్ల ఫారాలను పశుసంవర్ధక శాఖ రాయచోటి ఉపసంచాలకులు డా.మాల కొండయ్య, ప్రాంతీయ పశువైద్యాధికారి డా.గణేష్‌లు శుక్రవారం పరిశీలించారు. మన ప్రాంతాంలో కోళ్ల మరణాలను సంభవించలేదన్నారు. కోళ్ల యజమానులు బయో సెక్యూరిటీ పాటించాలని సూచించారు. కోళ్ల మరణిస్తే వెంటనే వైద్యులకు తెలియజేయాలని ఆదేశించారు. అనంతరం చిన్నమండెం పశువైద్యశాలను సందర్శించి సిబ్బందితో సమావేశం నిర్వహించి బర్డ్‌ఫ్లూ పైన, 1వ తేదీన పశుగణన, పశుసంవర్ధకపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

అంధత్వం నివారించడమే లక్ష్యం

ఓబులవారిపల్లె : విద్యార్థులకు అంధత్వం నివారించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ద్వారా పరీక్షలు నిర్వహించి ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం ముక్కావారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చైల్డ్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంటి వైద్యులచే పరీక్షలు నిర్వహించి అనంతరం కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం బుజ్జమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొనారు.

రీసర్వే పనుల పరిశీలన

పెనగలూరు : మండలంలోని ఎస్ఆర్ పురంలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని సర్వే డీఐ గురువయ్య శుక్రవారం పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ అమరేశ్వరీతో సమావేశమై రీసర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేకు సంబంధించి మండల సర్వేయర్లు రిపోర్టు ఇవ్వాలన్నారు. అలాగే బస్టాండ్ సర్కిల్‌లో ఇటీవల ఆక్రమణకు గురైన రోడ్డుకు సంబంధించిన పూర్తి వివరాలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

బీసీ బాలుర హాస్టల్ తనిఖీ

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 పంచాయతీ పార్వతీపురంలో ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశామని అసిస్టెంటు బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని పలు రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు పరీక్షల్లో రాణించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డన్ రాజునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి 8న మెగా లోక్ అదాలత్



పోలీసులతో సమావేశమైన జడ్జి భార్గవి

నందలూరు : నందలూరు కోర్టులో మార్చి 8వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి కె.భార్గవి పేర్కొన్నారు. శుక్రవారం నందలూరు కోర్టులో పోలీసు అధికారులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారమయ్యే విధంగా సహకరించాలన్నారు. ప్రధానంగా క్రిమినల్, చెక్ బౌన్సు, తదితర కేసుల పరిష్కారానికి పోలీసులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట రూరల్ సీఐ రమణ, పుల్లంపేట, నందలూరు ఎస్ఐలు జె.మోహన్ కుమార్ గౌడ్, వెంకటేశ్వర్లు, పెనగలూరు ఏఎస్ఐ మల్లికార్జున, కోర్టు సూపరింటెండెంట్ రమేష్ కుమార్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయచోటికి మణిహారంగా వాసవాంబ ఆలయం



శ్రీకాంత్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

రాయచోటి టౌన్ : రాయచోటికి మణిహారంగా రాయచోటి శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయం విరాజిల్లుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన రాయచోటి శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయం పునఃనిర్మాణం పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనను ఆర్యవైశ్యం సంఘం నాయకులు ఆహ్వానం పలికారు. అనంతరం ఆయన పేరున అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయండి

చిన్నమండెం : రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని శుక్రవారం ఆయన నివాసంలో ఆర్టీసీ ఈడీ చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆర్టీసీ అధికారులకు ఎటువంటి సమస్యలున్నా తమకు తెలియజేసి పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట!

- ఫ్లైఓవర్ బ్రిడ్జిపై మట్టి దిబ్బలు, సిమెంట్ స్తంభాలు
- పాదచారులకు, వాహనదారులకు పొంచివున్న ప్రమాదం



ఫ్లై ఓవర్ ఫుట్‌పాత్‌పై అడ్డంగా ఉన్న సిమెంటు దిమ్మెల పెచ్చులు, స్థంభాలు



ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై రోడ్డులోనే ఉన్న మట్టి దిబ్బ

రాజంపేట టౌన్ : పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఉన్న సేఫ్టీవాల్‌ను కొన్ని నెలల క్రితం కారు ఢీకొనడంతో కొంతమేర దెబ్బతినింది. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు తొలుత సిమెంటుతో తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. అయితే దాదాపు ఇరవై రోజుల క్రితం శాశ్విత చర్యలు చేపట్టడంలో భాగంగా సేఫ్టీవాల్‌కు చిన్న స్తంభాలను అడ్డంగా ఏర్పాటు చేయించారు. ఆ సమయంలో తాత్కాలికంగా సిమెంటుతో కట్టిన కట్టడాలను తొలగించి అందుకు సంబంధించిన పెచ్చులను ఫుట్‌పాత్‌పైనే వేశారు. అలాగే మిగిలిన చిన్న స్తంభాలను కూడా అక్కడే వదిలేశారు. దీంతో ఇవి ఫుట్‌పాత్‌పై నడిచేవారికి ఇబ్బందికరంగా ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల వైపు నుంచి పట్టణంలోకి నడక ద్వారా వచ్చే వారు ఆ ప్రాంతానికి వచ్చేసరికి కిందికి దిగాల్సి వస్తుంది. అయితే పాదాచారులు కిందికి దిగే సమయంలో వాహనాలు వస్తే పెద్ద ప్రమాదమే జరుగుతుంది. ఇదిలావుంటే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఉన్న మట్టిని తోసి అక్కడక్కడ కుప్పలుగా పెట్టడంతో ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. పట్టణం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వైపు వెళ్లేవారు ఎడమవైపు నుంచి వెళ్లాల్సి ఉంది. అందువల్ల ఆటువైపు వెళ్లే వాహనదారులు మట్టి దిబ్బలను గమనించుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఒక మార్గంలో ఫుట్‌పాత్‌పై తొలగించిన సిమెంటు దిమ్మెల పెచ్చులు, చిన్న స్తంభాలను తొలగించకుండా అలాగే ఉంచడం, మరోమార్గంలో మట్టిదిబ్బలను ఎత్తివేయకపోవడం ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని పాదాచారులు, వాహనదారులు పెదవి విరుస్తున్నారు.

చాలా ఇబ్బంది పడుతున్నాం



ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఉన్న ఫుట్‌పాత్‌పై తెల్లవారుజాము నుంచి నాబోటి ముసలోల్లు, యువకులు, మహిళలు వాకింగ్ చేస్తుంటారు. ఫుట్‌పాత్‌పై మధ్యలో కొన్ని స్తంభాలు, దిబ్బెల పెచ్చులు ఉండటం వల్ల రోడ్డుపైకి దిగాల్సివస్తుంది. ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వాహనాలు వేగంగా వెళుతుంటాయి. ఆ సమయంలో ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే ఏంకావాలి. అధికారులు వెంటనే స్తంభాలను, దిమ్మెల పెచ్చులను తొలగింపజేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

– బి.రామసుబ్బారెడ్డి, భరత్‌నగర్, రాజంపేట

భయమేస్తుంది



బ్రిడ్జిపై చదువుకునే పిల్లోల్లు, యువకులు చాలా స్పీడుగా బైక్‌లు నడుపుతుంటారు. అందువల్ల స్కూటర్లలో వెళ్లే నాబోటి వృద్ధులు చాలా మంది రోడ్డుకు వారగా వెళ్తాం. అయితే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఉండే మట్టిని తోసి రోడ్డుకు వారన కుప్పలుగా పెట్టారు. ఇప్పుడు రోడ్డు వారన పోవాలంటే భయమేస్తుంది. ఎదురుగా పెద్దవాహనాలు వస్తే కచ్చితంగా వారన వెళ్లాల్సివస్తోంది. పొరపాటున మట్టికుప్పపైకి స్కూటర్ వెళితే అదుపు తప్పి కిందపడాల్సి వస్తోంది. మున్సిపల్ అధికారులు స్పందించి మట్టికుప్పలను తొలగింపచేయించేందుకు చర్యలు తీసుకోవాలి.

– కలికిరి వెంకటసుబ్బయ్య, గురుస్వామిరాజునగర్, రాజంపేట

రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి



రైతు సమస్యను తెలుసుకొంటున్న జేసీ రాజేంద్రన్

సంబేపల్లె : రైతుల సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. శుక్రవారం సంబేపల్లె తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయి నుంచి ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో వున్న భూ సమస్యలపై ఆయన రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎస్.సోమవరం గ్రామంలో జరుగుతున్న రీసర్వేను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రణ్యంరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేషనల్ అప్రెంటిస్ ట్రైనింగ్ స్కీంకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి అర్బన్ : మున్సిపల్ పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల కుటుంబీకులకు మెప్మా ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణను అందించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వాసుబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేషనల్ అప్రెంటిస్ ట్రైనింగ్ స్కీం (ఎన్ఏటీఎస్) ఆశ సొసైటీ వారిచే స్కిల్ డెవలప్‌మెంట్ ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్‌తోపాటు రూ.3500లు స్టైఫండ్‌గా అందజేస్తామన్నారు. సర్టిఫికెట్ పొందిన అభ్యర్థులకు ఉద్యోగావకాశాలను సైతం కల్పించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు 2021 తర్వాత డిగ్రీ పాసై ఉండాలని, ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ సర్టిఫికెట్లు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ కాపీలను ఈనెల 20వతేదీ లోపు పట్టణంలోని మెప్మా కార్యాలయంలో అందజేయాలంటూ కోరారు. మరింత అదనపు సమాచారం కోసం సిటీ మిషన్ మేనేజర్, మెప్మా ఫోన్ నం.79016 10276ను సంప్రదించాలన్నారు. పట్టణ పరిధిలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటూ కోరారు.

తెల్లపూత దశలో రసాయనాలు పిచికారీ చేయవద్దు

మామిడి రైతులకు హెచ్ఓ నాగమణి సూచన

లక్కిరెడ్డిపల్లి : మామిడిలో తెల్లపూత దశలో రైతులు ఎలాంటి రసాయనాలు పిచికారీ చేయకూడదని లక్కిరెడ్డిపల్లి ఉద్యానశాఖ అధికారిణి (హెచ్‌ఓ) టి.నాగమణి పేర్కొన్నారు. మండలంలోని మద్దిరేవుల, కస్తూరిరాజుగారిపల్లి గ్రామాలలో ఉద్యానశాఖ అధికారి టి.నాగమణి ఆధ్వర్యంలో మామిడి పూత, పిందె సమయంలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ పచ్చిపూత దశలో ఆశించే తేనెమంచు పురుగు, బూడిద తెగులు, పక్షికన్ను తెగులు నివారణకు బుప్రోఫిజిన్ 1.5 మిల్లీ లీటర్ నీటికి కంటాఫ్ 2 మిల్లీ లీటర్, అజాడిరెక్టిన్ 2 మిల్లీ లీటర్ నీటికి పిచికారీ చేయాలని రైతులకు తెలిపారు. మామిడి నల్లపూత దశ అనగా పిందె బఠాణి గింజ సైజులో ఉన్నప్పుడు ఆశించే తేనెమంచు పురుగు, తామర పురుగు, బూడిద తెగులు, పక్షికన్ను తెగులు, పిందె రాలడం నివారణకు బుప్రోపేజిన్ ప్లస్ ఎసిఫెట్ ఒక గ్రాము లీటరు నీటికి సాఫ్ 2 గ్రాములు లీటర్ నీటికి ప్లానోఫిక్స్ 0.25 మిల్లీ లీటర్ నీటికి పిచికారీ చేయాలన్నారు. మామిడి పిందెలు గోలికాయ నుండి నిమ్మకాయ సైజు ఉన్నప్పుడు పది సంవత్సరాలు పైబడిన చెట్లకు రెండోసారి ఎరువులు అనగా యూరియా 1 కేజీ, పొటాష్ 750 గ్రాములు చెట్లకు చొప్పున భూమిలో వేసి ఫిబ్రవరి, మార్చి నెలల్లో నీటి తడులను 15 రోజులకొకసారి ఇవ్వాలని సూచించారు. మామిడి గోలికాయ దశ నుండి నిమ్మకాయ దశ వరకు ఆశించే తొడిమ కుళ్లు తెగులు నివారణకు అమిస్టార్ ఒక మిల్లీ లీటర్ నీటికి లేదా నాటివో ఒక గ్రాము లీటర్ నీటికి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సహాయకులు లావణ్య, రైతులు పాల్గొన్నారు.

భూగర్భ జలాలు పెంచడమే ‘వాటర్ షెడ్’ లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

సుండుపల్లె : భూగర్భ జలాల అభివృద్ధి కోసం వాటర్ షెడ్ పనులను చేపట్టడం జరుగుతోందని డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాటర్ షెడ్ యాత్ర కార్యక్రమంలో భాగంగా రైతులకు, విద్యార్థులకు, ప్రజలకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుండుపల్లె మండలంలో చిన్నగొల్లపల్లి, పాలిమేర పల్లి, సుండుపల్లి గ్రామ పంచాయతీలలో 4936 హెక్టార్లకు రూ. 5.10 కోట్లతో పనులు మంజూరయ్యాయని వారు తెలిపారు. వాటర్ షెడ్ పనుల్లో భాగంగా ఫారం పాండ్, చెక్‌డ్యామ్‌లు, నీటి నిల్వ గుంతలు నిర్మించడం వలన భూమిలో తేమశాతం పెరిగి భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. వీటితోపాటు రైతులకు అవసరమయ్యే వ్యవసాయ యంత్రాలు, పైపులు తదితర వ్యవసాయ సామగ్రి సబ్సిడీతో అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వాటర్ షెడ్ ఏపీడీ నరసయ్య, ప్రాజెక్టు ఆఫీసర్ అశోక్ రెడ్డి, ఏపీఓ మాలిక్ బాషా, వీర స్వామి, కూటమి నాయకులు, వాటర్ షెడ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకత కోసమే యూనిక్ ఐడీ



మైలపల్లె సచివాలయంలో గుర్తింపు కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు

చిట్వేలి : ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడీ) కోసం ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సందీప్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతి రైతుకు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకురావచ్చన్నారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుందన్నారు. గుర్తింపు సంఖ్య నమోదుకు ఆధార్ నెంబరు, ఆధార్ అనుసంధారిత ఫోన్ నెంబర్, పట్టాదార్ పాస్ పుస్తకం, ఈ మెయిల్ ఐడీ ఉన్న రైతులు ఐడీ నెంబర్ తీసుకొని గ్రామంలోని రైతు సేవా కేంద్రం సిబ్బందిని కలిసి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఏఓ రైతులకు విజ్ఞప్తి చేశారు.

క్రీడల అభివృద్ధికి సహకరించండి

రాయచోటి టౌన్ : రాష్ట్రంలో క్రీడలకు స్వర్ణయుగం రాబోతోందని అన్నమయ్య జిల్లా హాకీ అసోసియేషన్ సెక్రటరీ నాగేశ్వరావు, కోచ్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని జిల్లా కేంద్రంలోని కలుసుకుని మాట్లాడారు. క్రీడల అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి స్పందించి జిల్లా కేంద్రాన్ని క్రీడా సెంటర్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నట్లు వారు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ క్రీడాకారులు నూరుల్లా, ఇస్మాయిల్, సాధిక్ హుస్సేన్, క్రీడాకారులు నారాయణ, రాజీ తదితరులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు నివాళి

పుల్లంపేట : దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంజీవయ్య మొదటి దళిత ముఖ్యమంత్రిగా 1960లో పనిచేశారని, దళితుల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని, అతి చిన్న వయస్సులో ముఖ్యమంత్రిగా ఎన్నికైన వ్యక్తి దామోదరం సంజీవయ్య అని కొనియాడారు.

అమర జవాన్లకు ఘన నివాళి

రాయచోటి అర్బన్ : పుల్వామా దాడులలో అమరులైన జవాన్లకు అఖిల భారత విద్యార్థి పరిషత్‌కు చెందిన విద్యార్థులు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం పట్టణంలోని ప్రతిభా జూనియర్ కళాశాలలో పుల్వామా అమరవీరుల చిత్రాలు ముద్రించిన బ్యానర్‌కు వారు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నేత ఎ.శివగంగిరెడ్డి, ఏపీయూఎస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు నరసింహులు 2019 ఫిబ్రవరి 14న పుల్వామా వద్ద ఉగ్రవాదులు జవాన్లపై దాడి చేసి చంపడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నేతలు ప్రశాంత్, అజీమ్, నరసింహ, షాహీద్, సింహాద్రి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా



కిషోర్ రెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

ఓబులవారిపల్లె : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఏపీటీడీసీ మాజీ డైరెక్టర్ వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి ఆయన పుట్టినరోజు వేడుకలను కొర్లకుంట క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికిషోర్ రెడ్డికి నాయకులు, కార్యకర్తలు శాలువా, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

సామాన్యులకు న్యాయం చేయండి

రాయచోటి టౌన్ : ఎన్నో వ్యయప్రయాసాలను ఓర్చుకొని వచ్చే సామాన్య ప్రజలకు న్యాయం చేయాలని రజక సంఘం నాయకులు రమేష్ బాబు, శ్రీనివాసులు తహశీల్దార్ నరసింహాకుమార్‌ను కోరారు. నూతనంగా రాయచోటి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన నరసింహాకుమార్‌ను కలసి సన్మానించారు. అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని వారు తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

రాయచోటి జగదాంబ సెంటర్ : మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు అయ్యావారురెడ్డి ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. మాసాపేట రెడ్డివారిపల్లెలో శుక్రవారం అయ్యావారురెడ్డి నివాసానికి వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులును అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు.

కబ్జాలను అడ్డుకోండి

ఓబులవారిపల్లె : మండలంలో భూ కబ్జాలు అడ్డుకోవాలని సీపీఐ నాయకులు శుక్రవారం తహసీల్దార్ శ్రీధర్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముక్కవారిపల్లి పంచాయతీ చెరువు తట్టు భూమి సర్వే నెంబరు. 1086లో రాత్రికిరాత్రే టీడీపీ నాయకులు ఆక్రమించి ఇల్లు కట్టారని, రెవెన్యూ అధికారులు హెచ్చరించిన పనులు పూర్తి చేశారని ఆరోపించారు. అలాగే బొమ్మవరం పంచాయతీలోని సర్వే నెంబరు 44లో బస్సు షెల్టర్‌ను మంగళంపల్లికి చెందిన టీడీపీ నాయకుడు కబ్జా చేశారని చెప్పారు. సంబంధిత రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకొని భూమిని స్వాధీనం చేసుకోవాలని లేకుంటే నిరాహార దీక్షలు చేపడతామని తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఐ రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, నియోజకవర్గ డీహెచ్‌పీఎస్ కార్యదర్శి మోడి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

సిద్దవటం : మండలంలోని ముమ్మడిగుంటపల్లె దళితవాడలో కొన్ని రోజులుగా తాగునీటి సమస్య నెలకొందని ఆ గ్రామానికి చెందిన దళితులు శుక్రవారం ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దళిత మహిళలు మాట్లాడుతూ మా గ్రామంలో 70 దళిత కుటుంబాలు ఉన్నాయని తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని సమస్యను ఎవరూ పరిష్కరించలేదన్నారు. మా గ్రామానికి కొన్ని రోజులుగా కొళాయిలకు, బోర్లకు తాగునీరు రాక సుమారు రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ పంట పొలాల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నామన్నారు. దళితవాడలో ఉన్న బోరు పనిచేయడం లేదని, తాగునీటి సమస్యను పరిష్కారం చేయాలన్నారు. ఈ విషయమై ఈఓపీఆర్‌డీ మెహతాజ్ యాస్మిన్‌ను వివరణ కోరగా ముమ్మడిగుంట పల్లెలోని దళితవాడలో ఉన్న మంచి నీటి బోరు కొద్దిగా సమస్య ఏర్పడిందని, మరమ్మతులు రెండు రోజుల్లో పూర్తి చేసి తాగునీటి సరఫరా అందిస్తామని ఆమె వివరించారు.

ఫైలేరియాను అలసత్వం చేస్తే ప్రమాదం



ఫైలేరియా వ్యాధిగ్రస్తురాలి కాలిని నీటితో శుభ్రం చేస్తున్న వైద్యులు

ఒంటిమిట్ట : ఫైలేరియా వ్యాధిని అలసత్వం చేస్తే చాలా ప్రమాదకరమని కడప జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ మనోరమ అన్నారు. శుక్రవారం ఒంటిమిట్ట, సిద్దవటం, అట్లూరు మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె ఆధ్వర్యంలో ఫైలేరియా రోగుల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సిద్దవటం సబ్ యూనిట్ పరిధిలో ఫైలేరియాతో 38 మంది బాధపడుతున్నారన్నారు. రోగులకు ఆయా మండలాల పీహెచ్‌సీలలో వైద్యాధికారులు చికిత్స అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వ్యాధి రాకుండా ఉండేందుకు చేపట్టాల్సిన చర్యలను సూచించారు. అనంతరం వ్యాధితో బాధపడుతున్న వారిని పరీక్షించి చికిత్స అందించారు. అనంతరం ఒంటిమిట్టలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సిద్దవటం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ ఇండ్ల సుబ్బరాయుడు, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శివకుమార్, డాక్టర్ హేమలత, డాక్టర్ మాధురి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాగరాజరావు, సూపర్‌వైజర్ మహబూబ్ బాషా, వైద్య సిబ్బంది రమణయ్య, జ్యోతిక, విజయలక్ష్మి, ఉమాదేవి, నాగభూషణమ్మ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దు యోచనను విరమించుకోవాలి

రాయచోటి అర్బన్ : ఆప్కాస్ రద్దుచేయాలన్న యోచనను రాష్ట్రప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్ రద్దుచేసే అంశంపై నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. రాష్ట్రప్రభుత్వం జీఓ నం. 2 ద్వారా ప్రభుత్వశాఖలలో పనిచేసే ఉద్యోగులకు మాత్రమే ఎంటీఎస్ వర్తింపచేస్తూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఇప్పటివరకు పనిచేస్తున్న ఉద్యోగులందరికీ తీవ్రఅన్యాయం చేస్తోందంటూ విమర్శించారు. ప్రతినెలా ఒకశాతం కమీషన్‌తో వేతనాలు, సర్వీసును అందించే ఆప్కాస్‌ను రద్దుచేసి 4 శాతం కమీషన్ తీసుకునే రాబందులు లాంటి కాంట్రాక్టర్ల చేతికి 1 లక్ష 20 వేల మంది ఉద్యోగుల భవిష్యత్తును అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధపడుతుండడం దారుణమన్నారు. మెరుగైన పాలనను అందిస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం భద్రతలేని ఉద్యోగాల కల్పన పట్ల మొగ్గుచూపడం సరైన పద్ధతి కాదన్నారు. ఒకవైపు రాష్ట్ర ఖజానాలో నిధులు లేవంటూనే మరోవైపు కాంట్రాక్టర్లకు రూ.70 కోట్లు చెల్లించేందుకే ఆప్కాస్‌ను రద్దుచేస్తున్నట్లు ఆరోపించారు. సమావేశంలో సీఐటీయూ రాయచోటి నేతలు మాధవయ్య, రెడ్డెయ్య, రామచంద్రలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదు



మిర్యాల సురేఖ

రాజంపేట రూరల్ : రాష్ట్రంలోని మహిళలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మిరియాల సురేఖ అన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గుర్రంకొండలో గౌతమిపై టీడీపీ నాయకుడి కుమారుడు యాసిడ్‌తో దాడి చేయడమే కాక విచక్షణారహితంగా కత్తితో దాడి చేయడం యావత్తు మహిళా లోకాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. రాష్ట్రంలో కూటమి నాయకుల అరాచకాలు, ఆగడాలు పేట్రేగిపోతున్నాయన్నారు. మహిళలపై వరుస సంఘటనలు జరుగుతున్న రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడం దౌర్భాగ్యమన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల భద్రతపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పదేపదే హెచ్చరిస్తున్నా పట్టించుకోకపోవటం దుర్మార్గమన్నారు. మహిళల రక్షణ కోసం గత ప్రభుత్వం అమలు చేసిన దిశా చట్టాన్ని తొలగించాక మహిళలపై వరుస దాడులు, అఘాయిత్యాలు, హత్యలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో దిశా చట్టం అమలులో లేదని హోం మంత్రి వంగలపూడి అనిత చెప్పడమే ఇలాంటి సంఘటనలకు ఊతం ఇస్తున్నాయని అభిప్రాపడ్డారు. కూటమి ప్రభుత్వ ఉదాసీన వైఖరి వల్లే ఇలాంటి ఘటనలు తరుచూ జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ పాలనపై ఉన్న శ్రద్ధ మహిళల భద్రతపై చూపించాలని ఎద్దేవా చేశారు. గుర్రంకొండ ఘటనకు కారకుడైన టీడీపీ నాయకుడి కుమారుడిని కఠినంగా శిక్షించడమే కాక, దిశా చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్యానికి న్యాయవ్యవస్థ మూలస్తంభం



మాట్లాడుతున్న జడ్జి కృష్ణన్ కుట్టి

రాయచోటి అర్బన్ : మనదేశ ప్రజాస్వామ్యానికి న్యాయవ్యవస్థ మూలస్తంభం అని రాయచోటి 5వ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి అన్నారు. రాయచోటి ప్రిన్సిపుల్ జూనియర్ సివిల్ జడ్జి ఆసిఫా సుల్తానా, లక్కిరెడ్డిపల్లె జూనియర్ సివిల్‌జడ్జి ఫైజున్నీసాల బదిలీలను పురస్కరించుకుని రాయచోటి బార్ అసోసియేషన్ న్యాయవాదులు శుక్రవారం కోర్టు ఆవరణలో వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ దేశంలో న్యాయవ్యవస్థకు ఒక ప్రత్యేకస్థానం ఉందన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజ్యాంగ విరుద్ధంగా చట్టాలు చేస్తే వాటిని సమీక్షించే అధికారం రాజ్యాంగం సుప్రీంకోర్టుకు కట్టబెట్టిందన్నారు. ఇదే మన రాజ్యాంగం గొప్పతనం అన్నారు. బదిలీపై వెళుతున్న జూనియర్ సివిల్ జడ్జిలు ఆసిఫా సుల్తానా, ఫైజున్నీసాలు మాట్లాడుతూ విధి నిర్వహణలో తమకు న్యాయవాదులంతా సహకరించడం, పదోన్నతితో కూడిన బదిలీపై తాము ఇక్కడ నుంచి వెళ్లడం సంతోషాన్ని కలుగచేస్తోందన్నారు. అనంతరం న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదుల గుమస్తాలు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తోపాటు కార్యవర్గం సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వీఆర్‌డీఎస్ సేవలు అభినందనీయం



భాస్కర్ రెడ్డిని సన్మానిస్తున్న వీఆర్‌డీఎస్ సభ్యులు

వీరబల్లి : నిరుపేద కుటుంబాలలో వెలుగులు నింపేందుకు వీఆర్‌డీఎస్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ గాలివీటి విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం వీఆర్‌డీఎస్ సంస్థ 19వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, రొట్టె పంపిణీ చేశారు. అనంతరం వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ 2006లో అప్పటి ఎంపీపీ గాలివీటి విజయభాస్కర్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభమైందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సామాజిక సేవ కార్యక్రమాలు చేస్తూ వస్తున్నామన్నారు. అలానే ఎస్‌డీకేఆర్ డిగ్రీ, పీజీ కళాశాల స్థాపించి పేద విద్యార్థులకు ఉన్నత చదువులను దగ్గర చేశామని పేర్కొన్నారు. అనంతరం గౌరవ అతిథి భాస్కర్ రెడ్డిని సంస్థ ట్రెజరర్ బాబు రాజేంద్ర ప్రసాద్ రెడ్డి, ప్రభుత్వ డాక్టర్ మనీషా, సభ్యులతో కలిసి శాలువాతో సన్మానించారు.

బాధిత కుటుంబానికి తోడుగా..

రాయచోటి జగదాంబసెంటర్ : మాసాపేటకు చెందిన వైఎస్ఆర్‌సీపీ యువజన నాయకుడు విక్కీ దేవేంద్ర మృతి పార్టీకి తీరనిలోటని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. విక్కీ దేవేంద్ర కుటుంబాన్ని ఆయన శుక్రవారం పరామర్శించి ఓదార్చారు. అతని మృతి పట్ల సంతాపం తెలిపారు. విక్కీతో తనకున్న అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. విక్కీ దేవేంద్ర వైఎస్ఆర్‌సీపీలో క్రియాశీలకంగా పనిచేశారని, వారి కుటుంబానికి తోడుగా ఉంటామని శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బేపారి మహమ్మద్‌ఖాన్, నాయకులు సుగవాసి శ్యామ్, జీఎండీ ఇమ్రాన్, జీఎండీ ఇర్షాద్, అమీర్, నవాజ్, కొత్తపల్లి ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.



నందలూరు: నివాళి అర్పిస్తున్న ఆకేపాటి, కొరముట్ల

నందలూరు : మండలంలోని నందలూరు గ్రామ పంచాయతీ హరిజనవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కంభం మణి అనారోగ్యం కారణంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మణి మృతదేహానికి నివాళులు అర్పించి మృతుని కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.